శుభ్రత శూన్యం

14వ వార్డులో పూడికలతో నిండిన డ్రైనేజీలు

- పచ్చదనం కోల్పోయి.. చెత్తకుప్పల నిలయంగా గ్రీన్‌బెల్ట్‌లు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది


పోర్టు స్టేడియం పక్కన రహదారిలో కుంగిన కల్వర్టు


బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో చెత్తాచెదారం, వ్యర్థాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు పరిధి జాతీయ రహదారికి ఇరువైపులా గల గ్రీన్‌బెల్ట్‌లు పచ్చదనం కోల్పోయి కళావిహీనంగా తయారయ్యాయి. వీటి నిర్వహణను చూడాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో చెత్తకుప్పలకు నిలయంగా మారాయి. పచ్చని మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన సంబంధిత అధికారులు, సిబ్బంది వీటివైపు కనీసం చూడటం లేదు. 14వ వార్డులో మరోవైపు డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం పక్కన పలు ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమలు, వాటి ద్వారా వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి.

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హైవేకు ఇరువైపులా గ్రీన్‌బెల్ట్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా ప్రాంతాల్లో పార్కులు, ఉద్యానవనాలు, క్రీడా వేదికలు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లతో గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేశారు. అందమైన మొక్కలు నాటి పచ్చనదం పెంపొందించే ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రీన్‌బెల్టుల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో అవి పచ్చదనాన్ని కోల్పోయి కళతప్పాయి.

పిచ్చి మొక్కలు, ఎండిన చెట్లు

హైవేలో తాటిచెట్లపాలెం నుంచి గురుద్వారా వరకు ఇరువైపులా గ్రీన్‌బెల్ట్‌లు దారుణంగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు, ఎండిన మొక్కలు, ఎక్కడెక్కడో తొలగించిన చెట్ల కొమ్మలు, భవన నిర్మాణ వ్యర్థాలతో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలు నిండిపోయాయి. వాటి లోనికి ప్రవేశించేందుకు కూడా అవకాశం లేకుండా దట్టమైన పిచ్చిపొదలు పెరిగాయి. గ్రీన్‌బెల్ట్ ప్రాంతం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించేయడంతో వీటికి రక్షణ లేకుండా


పోర్టు స్టేడియం పక్కన బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పూడికతో నిండిన కాలువ

పోయింది. పచ్చని మొక్కలు పెంచి ప్రాణవాయువును, ఆహ్లాదాన్ని అందించేలా గ్రీన్‌బెల్ట్‌లను తీర్చిదిద్దాలని పలువురు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దారుణంగా డ్రైనేజీలు..

పోర్టు స్టేడియం పక్కన గల డ్రైనేజీపై నిర్మించిన కల్వర్టు రోడ్డు మధ్యలో కుంగిపోయింది. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది గమనించిన స్థానికులు తాత్కాలికంగా ఈ డ్రైనేజీపై చెక్కలు, రాళ్లు కప్పి ఉంచుకున్నారు. డ్రైనేజీ ఇలా మారడంతో మురుగు నీరు ప్రవహించేందుకు వీలు లేకుండా పోయి, ఉన్నచోటే పేరుకుపోయి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మరో వైపు డ్రైనేజీ పూర్తిగా మట్టితో నిండిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.


డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు నీరు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: సీతమ్మధార 33/11 విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో చేపడుతున్న నిర్వహణ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్‌–1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏఎస్సార్ నగర్, సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపం, సీతారామరాజు విగ్రహం, నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

అలరించిన కవి సమ్మేళనం


మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అక్షరాలు, భాష, మాట, పరస్పర సమన్వయంతో కవిత పుట్టుకొస్తుందన్నారు. మాట కవిత్వంగా ధ్వనించాలంటే రుషితత్వం కావాలన్నారు. అసలైన కవిత్వం ప్రజల సమస్యలను, కన్నీళ్లను సముదాయించి సమాజ సంక్షేమానికి బాట కావాలని పేర్కొన్నారు. కవులు వినయ భూషణ్, కె.రామ్‌ప్రసాద్, సిహెచ్.చిన సూర్యనారాయణ, బి.ఎస్.మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, కె.జగదీశ్వరరావు, వి.హెచ్.రామ్మోహన్, జి.రామమూర్తి, ఆర్.శివాజి తమ స్వీయ కవితలు చదివి వినిపించారు. చల్లా రాంబాబు కవితలను సమీక్షించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


కృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు సీతమ్మధారకు చెందిన వాసవీ క్లబ్ ప్రతినిధి చెరకు శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా బుధవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఒక్కొక్కరికీ రూ.1,000 చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. డిస్ట్రిక్ట్ మిషన్ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) ఆధ్వర్యంలో బుధవారం సూర్యాబాగ్‌లోని బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో నిర్వహించిన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టేట్ టెక్నికల్ కన్సల్టెంట్ కోటి రెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వివరించారు. ప్రజలకు అందించాల్సిన సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.అప్పారావు, జిల్లా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలకం

మద్దిలపాలెం: దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు కీలక భూమిక పోషించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీ రిపబ్లిక్ డే ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ సామర్థ్యాలను మరింత మెరుగుపరచుకుంటూ ముందుకు సాగాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెగా ఈవెంట్ నిర్వహించాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ కేంద్ర యువజన అధికారి సైదా రమావత్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ శిబిరం అత్యుత్తమమైనదన్నారు. పారదర్శకంగా వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథక కార్యక్రమాల్లో ఏయూ అగ్ర భాగాన ఉందని ప్రశంసించారు.

త్రిముఖి గణపతిగా దుర్గాగణపతి


సీతంపేటలో త్రిముఖి గణపతి


మురళీనగర్–మాధవధార రహదారిలో కొలువైన లంబోదర వినాయకుడు

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఎనిమిదో రోజు బుధవారం త్రిముఖ గణపతి అలంకరణలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మహా గణపతి హోమం, మహా అభిషేకం, సహస్రనామార్చన, అలంకరణ జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. నవరాత్రుల్లో ఆఖరి రోజు గురువారం 'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో దుర్గాగణపతి దర్శనమిస్తారని ఈవో రమాభాయి తెలిపారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకుంటున్న లంబోదరుడు

మురళీనగర్: మురళీనగర్–మాధవధార రహదారిలో స్థానికులు ఏర్పాటు చేసిన లంబోదరుడి అవతారంలోని వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. స్వామికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నారు. బుధవారం గరిక పూజ, వివిధ రకాలతో పుష్పాంజలి సమర్పించారు.

మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రంలో డీఆర్‌ఎం పర్యటన


శిక్షణ కేంద్రంలో ట్రైనీలతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: డీఆర్‌ఎం లలిత్ బోహ్రా బుధవారం మర్రిపాలెంలోని మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రంలో పర్యటించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న లోకోపైలట్స్, అసిస్టెంట్ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్లతో ఆయన ముఖాముఖి మాట్లాడి శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న వారంతా ఏకాగ్రత, ఉన్నత ప్రమాణాలు, నిబద్ధతతో విధులు నిర్వర్తించేలా ముందుకు సాగాలని, జాతి నిర్మాణంలో రైల్వేల ద్వారా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కేంద్రంలోని తరగతి గదులు, మోడల్ రూమ్, కిచెన్‌లను డీఆర్‌ఎం పరిశీలించారు. మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలకు వినతి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న 50వ వార్డు నాయకులు

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని 50వ వార్డు సత్యానగర్ కొండవాలు ప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు సత్యానగర్ కొండవాలులో మట్టి పెళ్లలు విరిగి పడ్డాయని, జోనల్ కమిషనర్ రాము ఈ ప్రాంతాన్ని సందర్శించి తాత్కాలిక రక్షణ చర్యలు తీసుకున్నారని వారు తెలిపారు. కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు వేశారని, ఇలాంటి ప్రాంతాలను గుర్తించి రక్షణ గోడలు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు చెప్పారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు కూన వెంకటరావు, రంధి ఈశ్వరరావు, రామకృష్ణ, శంకరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసంతర్పణలు


చిన్నూరులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

సీతంపేట: అక్కయ్యపాలెం చిన్నూరులో శ్రీసాయి గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, లత, లీల, రాజు, సాయి, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

3 వేల మందికి అన్నదానం

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఊర్వశి కూడలి రవీంద్రనగర్‌లో షణ్ముఖ్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులు రాష్ట్ర అటవీ శాఖ మాజీ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి, టీడీపీ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.రఘునాథ్‌రెడ్డి, నమ్మి శంకర్, యూత్ సభ్యులు సిహెచ్.పవన్, పి.సుధా, పి.శేఖర్, దినేష్, రాజా, వసంత్, వేణు, గణేష్, కిషోర్, సిహెచ్.తరుణ్‌కుమార్, మణి, అప్పన్న, నాగేశ్వరరావు, నాగరాజు, రమేష్, బాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.


రవీంద్రనగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న గుజ్జు వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి

ఏయూ న్యాయ కళాశాలలో రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో టీచర్స్ డే వేడుకల్లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ఏయూ ఉపకులపతిగా అందించిన సేవలను వివరించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించారు. రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందన్నారు. యువత ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తదాతలుగా నిలవాలని సూచించారు. న్యాయ కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఏయూ విద్యార్థులు

గాయకుడు రామకృష్ణకు స్వర నీరాజనం


రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాది జానకి, గాయకులు

సీతంపేట: సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో రామకృష్ణకు స్వర నీరాజనం అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో రామకృష్ణ పాడిన పాటలను గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. ముందుగా ముఖ్య అతిథి న్యాయవాది ఉప్పలపాటి జానకి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎం.శ్రీనివాస్ కుమార్, జి.కె.రాధ, మహమ్మద్ ఖాన్, సుజాత, రుద్రవేణి, శ్యామ్, కృష్ణవేణి, శ్రీనివాస్, లక్ష్మీసాత్విక, కె.నాగేశ్వరరావు, కె.రమేష్ పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, జి.త్యాగరాజన్, ఏఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

- సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయొద్దు
- జోన్‌–3 అధికారులతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


జోన్‌–3 కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సీతంపేట: ప్రతి అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. జీవీఎంసీ జోన్‌–3 కార్యాలయంలో బుధవారం జోనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్‌–3 పరిధిలో ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయి, అవి ఏ స్థాయిలో ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయించాలని, సహాయక ఇంజినీర్లు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. జోన్ పరిధిలో గుర్తించిన అక్రమ కట్టడాలపై తీసుకున్న చర్యలపై ఆరా తీస్తూ అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయరాదని, అది జారీ చేసిన అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోన్ పరిధిలో ఖాళీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, రోడ్డు విస్తరణ పనులను వెంటనే మొదలు పెట్టాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ప్లాన్ మంజూరు దరఖాస్తును రెండు రోజుల కంటే ఎక్కువ కాలం తమ లాగిన్‌లో ఉంచకుండా పై అధికారులకు పంపించాలన్నారు. రెండు కంటే ఎక్కువ రోజులు తమ లాగిన్‌లో ఉంచుకున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, ప్లానింగ్ కార్యదర్శి విష్ణుకుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జెడ్సీని ఆదేశించారు.

నూరు శాతం పన్నుల వసూలు

ఆస్తి పన్ను, నీటి చార్జీలు, అద్దెలు, ఆశీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను జీవీఎంసీ కమిషనర్ ఆదేశించారు. వీధి విక్రేతల గుర్తింపు, అన్న క్యాంటీన్ల పరిశీలన నిత్యం చేపట్టాలని యూసీడీ అధికారులకు సూచించారు. టిడ్కో లబ్ధిదారులకు కేటాయించిన గృహాల్లో ఎంతమంది నివసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రాత్రి పారిశుధ్య పనుల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. జోన్ ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీధి కుక్కలు, పందుల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ నిత్యం చేపట్టాలన్నారు. సెంటర్ మీడియన్‌లో పచ్చదనం నిర్వహణను పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని కమిషనర్ సూచించారు.

స్మార్ట్ కార్డుల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: కార్డు దారులకు స్మార్ట్ కార్డుల పంపిణీలో, రేషన్ ఇవ్వడంలో డీలర్లు అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి వి.బి.రావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. స్మార్ట్ కార్డుల కోసం లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులపై 'స్మార్ట్ తిప్పలు' అనే శీర్షికన ఈ నెల 2న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. స్మార్ట్ కార్డుల పంపిణీ విషయమై అక్కయ్యపాలెం, సీతంపేట పరిధిలోని అన్ని డిపోలను సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేసినట్టు తెలిపారు. ఆగస్టు 31న డిపో డీలర్లకు స్మార్ట్ కార్డులు అందజేశామని, ఈ నెల 1 నుంచి వాటిని డిపోల వద్ద పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారుల స్మార్ట్ కార్డు ఏ డిపోలో ఉన్నది ఈపీడీఎస్‌లో తనిఖీ చేసి తెలియపర్చాలని, కార్డుదారుడు వారి డిపో అయితే ఈపీఓఎస్‌లో థంబ్ వేయించి స్మార్ట్ కార్డు, రేషన్ అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. పోర్టబిలిటీ కార్డు హోల్డర్స్ వారి సొంత ఊరు వెళ్లి తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు అక్కయ్యపాలెం, సీతంపేట పరిధిలోని 24 డిపోల్లో మొత్తం 16,757 స్మార్ట్ కార్డులు ఉండగా.. అందులో 6,036 కార్డులు సుమారు 36 శాతం కార్డుదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా


అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న గిగ్ వర్కర్లు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద స్విగ్గీ, జొమాటో రైడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కుమార మంగళం, అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే మినిమం గ్యారంటీ ఆదాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. 365 రోజులు ఒకే రకమైన రేటు, ఇన్సెంటివ్, కిలో మీటర్‌కు ఎంత రేటు ఇస్తారో యాప్‌లో చూపించాలన్నారు. బేస్ పే రూ.30కు పెంచాలని, గతంలో ఇచ్చిన విధంగా పీక్ రూ.12, నాన్ పీక్ రూ.10 ఇవ్వాలని కోరారు. ఇన్సెంటివ్‌కు 2 పిక్స్ కంపల్సరీ చేయరాదన్నారు. లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ప్రతి శని, ఆదివారాల్లో సేవలకు బంద్ పాటిస్తామని హెచ్చరించారు. నాయకులు ఎం.శ్రీనివాస్, అచ్యుత్, నాని, అర్జున్, నగరంలో రైడర్లు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

రహదారులు మురుగుమయం


శాంతిపురంలో షిర్డీసాయిబాబా ఆలయం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు


ఏక్తా అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డెక్కిన మురుగు నీరు

- శాంతిపురంలో రోడ్డెక్కి ప్రవహిస్తున్న మురుగు నీరు
- రెండు నెలలుగా స్థానికుల అవస్థలు
- పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్య సమస్యలు తిష్ట వేశాయి. శానిటేషన్ సిబ్బంది, మేస్త్రీలు, శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉన్నా.. వార్డులో సుమారు రెండు నెలలుగా మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోందంటే సిబ్బంది పనితీరు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. శాంతిపురంలోని 50–93–1/8 డోర్ నంబర్ షిర్డీసాయిబాబా ఆలయం వద్ద డ్రెయిన్ బ్లాక్ కారణంగా మురుగంతా నిలిచిపోయింది. రోడ్డుపై నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతున్నాయి. అక్కడే ఉన్న వీధి కుళాయి మురుగు నీటిలో మునిగిపోవడతో పెద్ద ప్లాస్టిక్ ట్యూబ్‌తో నీరు పట్టుకుంటున్న పరిస్థితి. రెండు నెలలుగా ఇదే అధ్వాన పరిస్థితి ఉన్నా.. పారిశుధ్య సిబ్బంది సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే మార్గంలో ఏక్తా అపార్ట్‌మెంట్ వద్ద డ్రెయిన్ బ్లాకై మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శాంతిపురంలో మెరుగైన పారిశుధ్యం కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.